• అమరుల సాక్షిగా ఆందోళన



అమరవీరుల స్థూపం నుంచి సచివాలయం వరకు ప్లకార్డులతో కుటుంబసభ్యుల ర్యాలీ

• అక్రమ అరెస్టులు



సచివాలయం వద్ద ఆందోళన చేస్తున్న మహిళను అరెస్టు చేస్తున్న పోలీసులు

• నాన్న కోసం న్యాయపోరాటం



సచివాలయం వద్ద ఆందోళనకు చంటిబిడ్డతో వచ్చిన కానిస్టేబుల్ సతీమణి

• అలిసి..సొలిసినా.. ఆగని పోరాటం



సచివాలయం వద్ద ఆందోళనలో అలిసిపోయి నీళ్లుతాగుతున్న మహిళ

# సర్కారుపై శిగమూగిన తెలంగాణ



రాష్ట్రంలో ఏక్ పోలీస్ విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేస్తూ సచివాలయం వద్ద ఆందోళన చేస్తున్న వివిధ బెటాలియన్ల కానిస్టేబుళ్ల కుటుంబసభ్యులు

# సచివాలయం ముట్టడి

## ఏక్‌పోలీస్ అమలుకు కానిస్టేబుళ్ల కుటుంబసభ్యుల డిమాండ్

- బలవంతంగా ఈడ్చి.. వ్యాన్లలో వేసిన పోలీసులు
- తీవ్ర వ్యతిరేకత రావడంతో వెనక్కి తగ్గిన ప్రభుత్వం
- కొత్త నిబంధనలు నిలిపివేస్తూ ఉత్తర్వులు

హైదరాబాద్, అక్టోబర్ 25 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో ఏక్ పోలీస్ విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేస్తూ వివిధ బెటాలియన్ల కానిస్టేబుల్స్ భార్యలు, వారి కుటుంబసభ్యులు శుక్రవారం సచివాలయాన్ని ముట్టడించారు. తమ భర్తలకు వెట్టి చాకిరి నుంచి విముక్తి కల్పించాలని, ఐదేండ్లు ఒకే చోట పనిచేసే వెసులుబాటు కల్పించాలని డిమాండ్ చేశారు. మూడు నెలలకోసారి స్టేషన్లు మార్చుకుంటూ వెళ్తుంటే, పిల్లల చదువులకు చాలా ఇబ్బందులు తలెత్తుతున్నాయని వాపోయారు. తమ బాధలు అర్థం చేసుకోవాలని ప్లకార్డులు ప్రదర్శించారు. ప్రభుత్వం తక్షణం తమకు న్యాయం చేయాలని సచివాలయం ప్రధాన ద్వారాల వద్ద వందలాది పోలీసు కుటుంబాలు గొంతెత్తి నినదించాయి. దీంతో అక్కడి చేరుకున్న పోలీసులు ఆందోళనలు చేస్తున్న వారిని అడ్డుకునే ప్రయత్నం చేశారు. దీంతో ఇరువర్గాల మధ్య కాసేపు వాగ్వాదం జరిగింది. పసిబిడ్డలతో మండుటెండలో పోలీసు ఉన్నతాధికారులకు తమ గోడు వెలిబుచ్చుకున్నారు. దీంతో అప్పటికప్పుడు స్పెషల్‌ఫోర్స్‌ను రప్పించి, వారిని అదుపులోకి తీసుకున్నారు. చంకలో పసి బిడ్డలున్నా కనికరించకుండా ఈడ్చి వ్యాన్లలో పడేశారు. అరెస్టు చేసిన వారిని నాంపల్లి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. తమ గోడు చెప్పుకుందామని వస్తే.. అరెస్టు చేస్తారా అంటూ కొందరు మహిళలు భోరున విలపించారు.



కన్నీళ్లతో విజ్ఞప్తి.. ఏక్ పోలీస్ విధానం కోసం కన్నీళ్లతో విజ్ఞప్తి చేస్తున్న మహిళ

'అయ్యా ముఖ్యమంత్రి గారు మా గోడు వినండి.. మా భర్తలను మమ్మల్ని వేరుచేయకండి' అంటూ కన్నీటితో వేడుకున్నారు. సాయంత్రం కూడా సచివాయలం ముట్టడిస్తామని బాధిత కుటుంబాలు హెచ్చరించిన నేపథ్యంలో ప్రత్యేక బలగాలను అందుబాటులో ఉంచారు.

### కొండాపూర్‌లో బెదిరింపులు

కొండాపూర్‌లోని 8వ పోలీసు బెటాలియన్ కానిస్టేబుల్స్ కుటుంబ సభ్యులు కొండాపూర్ ప్రధాన రహదారిలో ఆందోళన చేపట్టారు. వీరిని గచ్చిబౌలి పోలీసులు బెదిరించినట్లు సమాచారం. నిరసన తెలుపుతున్న మహిళల ఫోటోలు తీసుకుని, తర్వాత మీ సంగతి చూస్తామంటూ బెదిరింపులకు దిగారు. దీంతో కానిస్టేబుళ్ల కుటుంబ సభ్యులు బెటాలియన్ ప్రధాన ద్వారం మరోసారి బైఠాయించారు. గచ్చిబౌలి పోలీసులు క్షమాపణ చెప్పాల్సిందేనని పట్టుబట్టారు. బెటాలియన్ కమాండెంట్ సన్నీ అక్కడికి చేరుకొని వారిని సముదాయించారు.

### ఇవే ప్రధాన డిమాండ్స్

- ఏక్ పోలీస్- ఏక్ స్టేట్
- ఏక్ పోలీస్-ఏక్ విధానం అమలయ్యే వరకు టీజీఎస్పీ సిబ్బందిని లోకల్ డిస్ట్రిక్ట్‌లోని ఎస్పీ ఆఫీసుకు అటాచ్ చేయాలి
- ఈ విధానం అమలయ్యే వరకు మిస్ అకామిడేషన్ పూర్తిగా తీసివేయాలి
- ఆర్డర్లీ వ్యవస్థ పూర్తిగా రద్దు చేయాలి
- ప్రపంచంలో ఎక్కడా లేనివిధంగా టీజీఎస్పీలో మాత్రమే ప్రమోషన్స్ ఎందుకు వద్దనుకుంటున్నారో ఒక కమిటీ ద్వారా అడిగి తెలుసుకోవాలి
- సమస్యలపై కమిటీలను ఏర్పాటు చేస్తే బెటాలియన్ సిబ్బందితో 10 మందిని ఎన్నుకోవాలి. తద్వారా వారి సమస్యలను తెలుసుకోవాలి. ఇందులో అధికారులను భాగస్వాములను చేయొద్దు.

### దిగొచ్చిన ప్రభుత్వం..

తెలంగాణ స్పెషల్ పోలీస్ (టీజీఎస్పీ) బెటాలియన్ కానిస్టేబుళ్ల భార్యల ఆందోళనలకు ప్రభుత్వం దిగొచ్చింది. తదుపరి ఆదేశాలు వచ్చేంత వరకూ 26 రోజుల డ్యూటీ విధానాన్ని అమలు చేయబోమని స్పష్టం చేసింది. ఈ మేరకు టీజీఎస్పీ అడిషనల్ డీజీ సంజయ్‌కుమార్ జైన్ శుక్రవారం సర్క్యులర్ విడుదల చేశారు. కమాండెంట్లు అందరూ ఆయా బెటాలియన్లలోని సిబ్బందితో తక్షణం దర్బార్ నిర్వహించాలని ఆ సర్క్యులర్‌లో ఆదేశించారు. అలాగే వారి ఫిర్యాదులు, ఇతర సమస్యలకు సంబంధించిన అన్ని అంశాలను పరిగణలోకి తీసుకోవాలని కోరారు. అయితే ఈ ఆందోళనల నేపథ్యంలో సస్పెండ్ చేసిన వారిని వెంటనే విధుల్లోకి తీసుకోవాలని ఉన్నతాధికారులు ఆదేశించినట్లు తెలిసింది. గతంలో ఎన్నడూ లేనివిధంగా ఆందోళనలు జరగడం, ప్రజలు, పౌర సమాజం నుంచి తీవ్ర వ్యతిరేకత వచ్చిన నేపథ్యంలో సర్కారు వెనక్కి తగ్గింది.

### సమస్య ఏదైనా నేరుగా ఫిర్యాదు చేయండి

పోలీసు కుటుంబాల నుంచి వస్తున్న తీవ్రమైన ఒత్తిడి, ప్రజల్లోనూ వస్తున్న వ్యతిరేకతపై టీజీఎస్పీ అడిషనల్ డీజీ సంజయ్‌కుమార్ జైన్ స్పందించారు. ఈ మేరకు ఆ విభాగం అధికారిక ఎక్స్ ఖాతాలో ఓ పోస్టు చేశారు. 'సెలవులు/అనుమతులకు సంబంధించిన ఆర్డర్.. కొంత బాధను, గందరగోళాన్ని కలిగించిందని నేను విన్నాను. మీ సమస్యలను అర్థం చేసుకున్నాను. అందుకే ఆ ఆదేశాలను రద్దు చేశాను. కమాండెంట్లందరూ మీ అందరితో మాట్లాడి సమస్యలను అర్థం చేసుకోవాలని, మీ నుంచి ఫిర్యాదులను స్వీకరించాలని ఆదేశించాను. నా పోలీసు కుటుంబాలు, అధికారులు, వారి కుటుంబాల సంక్షేమం నాకు చాలా ముఖ్యమైనది. వాటికి పరిష్కారం కనుగొనేందుకు మా వంతు ప్రయత్నం చేస్తాం. ఏవైనా వ్యక్తిగత ఫిర్యాదులు ఉంటే, మీరు నేరుగా tgspcontrol@gmail.com మెయిల్‌కు, వాట్సాప్ అండ్ గ్రీవెన్స్ నంబర్ 8712658531 నంబర్‌కు సంప్రదించండి.' అంటూ సంజయ్‌కుమార్ జైన్ కోరారు.

## ధర్నాలతో దద్దరిల్లుతున్న తెలంగాణ

**ఎక్స్ వేదికగా మండిపడ్డ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్**

హైదరాబాద్, అక్టోబర్ 25 (నమస్తే తెలంగాణ): కాంగ్రెస్ పాలనలో అన్ని వర్గాల ప్రజల ధర్నాలతో తెలంగాణ దద్దరిల్లుతున్నదని కేటీఆర్ ఆవేదన వ్యక్తంచేశారు. 'దిక్కుమాలిన పాలనలో దిక్కూమొక్కులేని జీవితం గడుపుతున్నారు. అలంపూర్ నుంచి ఆదిలాబాద్ వరకు, గ్రామ సచివాలయం నుంచి రాష్ట్ర సచివాలయం వరకు, రైతు నుంచి రైస్ మిల్లర్ల వరకు, కార్మికుల నుంచి కాంట్రాక్టర్ల వరకు, టీచర్ల నుంచి పోలీస్ కుటుంబాల వరకు అన్ని వర్గాల ప్రజలు ఆందోళనలు చేస్తున్నారు' అని ఆయన ఎక్స్ వేదికగా మండిపడ్డారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని వర్గాల్లో 'వద్దురా నాయన కాంగ్రెస్ పాలన.. ముందు దగా-వెనక దగా.. కుడి ఎడమల దగా దగా, కాంగ్రెస్ వచ్చింది-కష్టాలు తెచ్చింది' అని ఆయన విమర్శించారు.

### పార్లమెంట్‌లో బీసీ బిల్లు పెట్టాలి:ఆర్ కృష్ణయ్య

హైదరాబాద్, అక్టోబర్25 (నమస్తే తెలంగాణ): పార్లమెంట్‌లో బీసీ బిల్లు ప్రవేశపెట్టి రిజర్వేషన్లను పెంచాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆర్ కృష్ణయ్య డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని ఢిల్లీలో సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శి రాజాను శుక్రవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కులగణనకు సీపీఐ ఏకగ్రీవంగా మద్దతు తెలుపుతుందని, పార్టీ జాతీయ సమావేశాల్లో తీర్మానం చేసినట్టు రాజా గుర్తుచేశారని తెలిపారు. ఓబీసీ బిల్లు కోసం పోరాడతామని హామీ ఇచ్చినట్టు కృష్ణయ్య వెల్లడించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీ వీ హనుమంతరావు, బీసీ నేతలు గుజ్జ కృష్ణ, నందగోపాల్, రాఘవేంద్ర, విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

### 'సంచారజాతులను ప్రత్యేకంగా లెక్కించాలి'

హైదరాబాద్, అక్టోబర్ 25 (నమస్తే తెలంగాణ): సంచార జాతుల జనాభాను ప్రత్యేకంగా లెక్కించాలని రాష్ట్ర సంచార జాతుల సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు నరేందర్, రాష్ట్ర అధ్యక్షుడు తిరుపతిశెట్టి శ్రీనివాస్ శుక్రవారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. రాష్ట్ర, జిల్లా స్థాయి సలహా మండలి సంచార జాతుల సభ్యులతో కూడిన కమిటీలను ఏర్పాటు చేయాలని కోరారు. సంచార జాతులకు ఆధార్, రేషన్, ఓటరుకార్డులను అందించాలని డిమాండ్ చేశారు.

### 'స్పెషలిస్టుల' నియామకం అన్యాయం: టీటీజీడీఏ

హైదరాబాద్, అక్టోబర్ 25(నమస్తే తెలంగాణ): బోధనా వైద్యులు కచ్చితంగా పీహెచ్‌సీల్లో సేవలందించాలని ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేయడం అన్యాయమని తెలంగాణ ప్రభుత్వ బోధన వైద్యుల సంఘం(టీటీజీడీఏ) పేర్కొన్నది. ప్రభుత్వ నిర్ణయాన్ని ఖండిస్తూ శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేసింది. స్పెషలిస్టు వైద్యులను పీహెచ్‌సీలకు వెళ్లాలని ఆదేశాలు ఇవ్వడంతో మెడికల్ కాలేజీల్లో సిబ్బంది కొరత ఉంటుందని, వైద్య కళాశాలల మనుగడ కష్టతరమవుతుందని హెచ్చరించారు. దేశంలో మరెక్కడా ఇలాంటి విధానం అమలులో లేదని, నిర్ణయాన్ని ఉపసంహరించుకోకపోతే నిరవధిక సమ్మె చేపడతామని వెల్లడించారు.

## ఓపెన్ వర్సిటీలో నిరసనలు

హైదరాబాద్, అక్టోబర్ 25 (నమస్తే తెలంగాణ) : బీఆర్ అంబేద్కర్ ఓపెన్ వర్సిటీకి సంబంధించిన 10 ఎకరాల భూమిని జేఎన్ఏఎఫ్ఏ వర్సిటీకి అప్పగించనున్నట్టు సీఎం రేవంత్‌రెడ్డి నిర్ణయం తీసుకున్న నేపథ్యంలో ఆ యూనివర్సిటీ ఉద్యోగులు, సిబ్బంది శుక్రవారం భోజన విరామ సమయంలో నిరసనలు కొనసాగించారు. ఈ కార్యక్రమంలో ఉద్యోగ జేఏసీ ఛైర్మన్ ప్రొఫెసర్ పల్లవి కాబ్డే, కన్వీనర్ వడ్డాణం శ్రీనివాస్, సెక్రెటరీ జనరల్ మహేశ్‌గౌడ్, జేఏసీ నేతలు డా. యాకేశ్ దైద, కాంతం ప్రేమ్‌కుమార్, ప్రొఫెసర్ పుష్పా చక్రపాణి, ప్రొఫెసర్ ఆనంద్ పవర్, రజనీకాంత్, డాక్టర్ వెంకటరమణ, రాములు, డాక్టర్ ఏ నారాయణరావు, రుషేంద్ర మణి, ఎన్సీ వేణుగోపాల్, తదితరులు పాల్గొన్నారు.

• నిర్మల్ జిల్లా రైతుల అడ్డగింత



నిర్మల్ జిల్లా దిలావ్‌పూర్ మండలం గుండ్లపల్లికి చెందిన 30 మంది రైతులను పోలీసులు అడ్డుకొన్నారు. శుక్రవారం నారాయణపేట జిల్లా చిత్తనూర్ గ్రామ శివారులోని ఇథనాల్ కంపెనీని పరిశీలించేందుకు రెండు మినీ ట్రావెల్స్ బస్సుల్లో పలువురు రైతులు వచ్చారు. ఈ కంపెనీతో ఇక్కడి రైతులు, ప్రజలు కాలుష్యం బారిన పడుతున్నారా? పర్యావరణానికి ఏర్పడే ముప్పు గురించి ఆరా తీసేందుకు రాగా.. వారిని మరికల్ మండల కేంద్రంలో పోలీసులు అడ్డగించి తిప్పిపంపారు. పోలీసుల తీరుపట్ల చిత్తనూరు ఇథనాల్ వ్యతిరేక పోరాట సమితి సభ్యులు అభ్యంతరం తెలిపారు. - మరికల్

## సీఎం ఇస్తామన్నారు! సీఎస్ ఇవ్వలేమన్నారు!

- జీవో-317పై క్యాబినెట్ సబ్ కమిటీ నివేదిక కోసం సీఎస్ వద్దకు వెళ్లిన జేఏసీ నేతలకు చేదు అనుభవం
- సర్క్యులేషన్‌లో ఉంది.. ఇవ్వలేమని చెప్పిన సీఎస్
- నిరాశతో వెనుదిరిగిన ఉద్యోగ సంఘాల నేతలు

'క్యాబినెట్ సబ్ కమిటీ జీవో-317పై నివేదికను సీల్డ్ కవర్‌లో సమర్పించింది. ఇంతవరకు దానిని ఓపెన్ చేయలేదు. నేను కూడా చూడలేదు. ఆ నివేదిక సీఎస్ దగ్గర ఉన్నది. శుక్రవారం సీఎస్‌ను కలవండి. మీకు తలా ఒక నివేదిక ఇస్తారు. అధ్యయనం చేసి, మార్పులు చేర్పులుంటే సూచించండి. క్యాబినెట్‌లో చర్చించి పరిష్కరిస్తాం'

– గురువారం ఉద్యోగ సంఘాల జేఏసీ నేతలతో సీఎం రేవంత్‌రెడ్డి

జీవో-317పై క్యాబినెట్ సబ్ కమిటీ నివేదిక ఫైల్ సర్క్యులేషన్‌లో ఉన్నది. ఇప్పుడైతే ఇవ్వడం కుదరదు. ప్రభుత్వం ఆ నివేదికను ఆమోదించిన తర్వాత బహిర్గతం చేస్తాం. మీరు ఏదైనా చెప్పేదుంటే చెప్పండి. మీ వినతుల్వివండి.

– శుక్రవారం ఉద్యోగ సంఘాల జేఏసీ నేతలతో సీఎస్ శాంతికుమారి

హైదరాబాద్, అక్టోబర్ 25 (నమస్తే తెలంగాణ): జీవో-317పై క్యాబినెట్ సబ్ కమిటీ అందజేసిన నివేదికను సీఎస్ ఇస్తారని సాక్షాత్తు ముఖ్యమంత్రే చెప్పడంతో శుక్రవారం సచివాలయానికి వెళ్లిన ఉద్యోగ సంఘాల జేఏసీ నేతలకు నిరాశే మిగిలింది. మధ్యాహ్నం 12 గంటల ప్రాంతంలో రెండు జేఏసీల నేతలు సీఎస్‌ను కలిశారు. అయితే, ఆ నివేదికను ఇవ్వలేమని, సర్క్యులేషన్‌లో ఉన్నదని సీఎస్ తేల్చిచెప్పడంతో ఉద్యోగ సంఘాల నేతలు ఖంగుతిన్నారు. ఒకేరోజు వ్యవధిలో సీఎం ఒకలా, సీఎస్ మరోలా చెప్పడంతో ఉద్యోగ సంఘాల నేతలకు ఏమి చేయాలో పాలుపోలేదు. చేసేదేమీలేక సీఎస్‌కు వినతిపత్రం ఇచ్చి వెనుదిరిగారు.

### స్థానికతను పరిగణనలోకి తీసుకోవాలి



జీవో-317తో ఉద్యోగులు స్థానికతను కోల్పోయారు. మెదక్, సిద్దిపేట, నిజామాబాద్, రంగారెడ్డి జిల్లాల్లోని ఉద్యోగులు ఈ జీవోతో నష్టపోయారు. పాత 6వ జోన్‌లోని కొన్ని జిల్లాలను మల్టీజోన్-1కు కేటాయించారు. దీంతో ఉద్యోగుల కేటాయింపులో అన్యాయం జరిగింది. భార్యాభర్తలు ఇద్దరూ ఉద్యోగులైతే ఒకే ప్రాంతంలో సర్దుబాటు చేయాలి. స్పౌజ్, పరస్పర, హెల్త్‌గ్రౌండ్స్‌లో న్యాయం చేసేందుకు క్యాబినెట్ సబ్ కమిటీ సిఫారసులు చేసినట్టు తెలుస్తున్నది. జీవోతో సమస్యలు ఎదుర్కొంటున్న ఉద్యోగులందరికీ న్యాయం చేయాలి. ఇలాంటి పరిస్థితులు మళ్లీ ఉత్పన్నం కాకుండా చూడాలి.

-వీ లచ్చిరెడ్డి, ఉద్యోగ సంఘాల జేఏసీ నేత

### కమిటీ రిపోర్టును బహిర్గతం చేయాలి



జీవో-317 ద్వారా నష్టపోయిన ఉద్యోగుల ప్రతి దరఖాస్తును పరిశీలించి న్యాయంచేయాలి. అవసరమైతే సూపర్ న్యూమరీ పోస్టులను సృష్టించి సర్దుబాటు చేయాలి. ఒక్కో జిల్లాలో ఒక్కో రకంగా క్యాడర్ విభజన చేపట్టారు. దీంతో గందరగోళానికి దారితీసింది. క్యాబినెట్ సబ్ కమిటీ రిపోర్టును బహిర్గం చేయాలి. ఉద్యోగులకు వ్యతిరేకమైన అంశాలను సవరించాలి. 5, 6 జోన్లను మల్టీజోన్లుగా చేయాలి. గెజిటెడ్ పోస్టులను పెంచాలి. రెండు మూడు నెలలకొకసారి జాయింట్ స్టాఫ్ కౌన్సిల్ సమావేశాలను ఏర్పాటుచేయాలి.

-మారం జగదీశ్వర్, ఉద్యోగ సంఘాల జేఏసీ నేత

• సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మల దహనం



బోథ్/గుడిహత్నూర్/తలమడుగు, అక్టోబర్ 25: కాంగ్రెస్ నాయకులు కేటీఆర్ దిష్టిబొమ్మను దహనం చేయడాన్ని నిరసిస్తూ బీఆర్ఎస్ నాయకులు శుక్రవారం ఆదిలాబాద్ జిల్లాలో పలు మండలాల్లో సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మలను దహనం చేశారు. ఆదిలాబాద్ జిల్లా గుడిహత్నూర్, బోథ్ మండలంలోని సొనాల, తలమడుగు మండలంలోని సుంకిడి బస్టాండ్ల వద్ద సీఎం రేవంత్ రెడ్డి బొమ్మలను దహనం చేసి నిరసన తెలిపారు.

## దిష్టిబొమ్మ దహనంలో అపశ్రుతి

**కాంగ్రెస్ నాయకులు, పోలీసులకు అంటుకున్న మంటలు**

బజార్‌హత్నూర్, అక్టోబర్ 25 : రైతు పోరుబాట సభలో కాంగ్రెస్ సర్కారుపై బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చేసిన విమర్శలకు నిరసనగా శుక్రవారం బజార్‌హత్నూర్‌లో ఆయన దిష్టిబొమ్మను దహనం చేస్తుండగా మంటలు ఎగిసిపడి కాంగ్రెస్ నాయకులు, ఓ కానిస్టేబుల్‌కు గాయాలయ్యాయి. ఈ ఘటనలో కాంగ్రెస్ పార్టీ మండల కన్వీనర్ జల్కె పాండురంగ్, బోథ్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ పోరెడ్డి నారాయణ, పాశపు వెంకటరమణ, సుభాష్, పోలీసు కానిస్టేబుల్ మోహన్‌కు గాయాలయ్యాయి. గాయాలపాలైన వారిని వెంటనే స్థానిక ప్రభుత్వ దవాఖానకు తరలించి చికిత్స అందించారు.